క్లుప్తంగా

ఆకట్టుకొన్న నృత్య ప్రదర్శనలు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవం, ధనుర్మాస ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. హరిగురు శరవణ నృత్యంజలి నాట్యాచార్య హరిగురు శరణ శిష్యులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆకట్టుకొన్నాయి. అనంతరం నాట్యాచారి హరి గురుశరణను సత్కళావాహిని సభ్యులు సత్కరించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారావు, కుంజుక లక్ష్మి, శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీవైఎఫ్ నాయకుల సదస్సు

కాకినాడ కల్చరల్: స్థానిక రామారావుపేటలోని సెయింట్ లూథరన్ చర్చిలో సీవైఎఫ్ నాయకుల సదస్సు క్రిస్టియన్ యూత్ ఫెలోషిప్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జరిగింది. ఈ సదస్సులో యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా సన్మార్గంలో, ఆధ్యాత్మిక వైపు నడిపించడంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. ఫిబ్రవరి 14న 'ప్రేమ ప్రాణం పెడుతుందా?, తీస్తుందా?' అనే అంశంపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని సీవైఎఫ్ నాయకులు మూర్తిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీవైఎస్ నాయకులు మూర్తిరాజు, నేషనల్ చైర్మన్ ఎం.కిరణ్, స్టేట్ చైర్మన్ గగారిన్, బుచ్చిబాబు, విలియమ్, డేవిడ్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

కరప: మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేల శిబిరంపై శనివారం కరప పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి, 8 మందిని అరెస్ట్ చేసినట్టు కరప ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు. గొర్రిపూడి, వేములవాడ, విజయరాయుడుపాలెం, గురజనాపల్లి గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న శిబిరాలపై ఎస్‌ఐ రామకృష్ణ ఏఎస్‌ఐలు జి.ప్రసన్నకుమార్, కె.సూరిబాబు, సిబ్బందితో కలిసి దాడి చేసి ఎనిమిది కోడిపుంజులు, ఎనిమిది కోడికత్తులు, రూ 4,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే పెదకొత్తూరు, వాకాడ గ్రామాల్లో గుండాట నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారివద్ద ఉన్న రూ 2,200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.



దేవాలయం వీధిలో తెల్లవారుజామునే ముగ్గులో గొబ్బెమను ఉంచి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



వాకలపూడి జీఎఫ్‌సీఎల్ కాలనీలో సంక్రాంతి సంబరాల్లో కురసాల సత్యనారాయణ తదితరులు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొని యువకులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



శిల్పారామంలో భరతనాట్యం నృత్య ప్రదర్శనలు

సంప్రదాయకంగా భోగి పండగ

- ప్రతి ఇంటా పండగ సందడి
- సంక్రాంతికి స్వాగతం పలుకుతున్న జనం

కరప: మండలంలోని గ్రామ, గ్రామాన శనివారం భోగి పండగను ప్రజలు సంప్రదాయకంగా జరుపుకున్నారు. హరిదాసు హరినామ సంకీర్తనలతో మేలుకొలుపు పాడగా యువకులు, పెద్దలు కల్సి తెల్లవారు జామునే లేచి ముందుగా సేకరించి ఉంచిన దుంగలు, కలప, పిడకలతో భోగిమంటను వేశారు. చిన్నారులు ఉదయాన్నే తలస్నానం ఆచరించి కొత్త బట్టలు ధరించారు. భోగి పిడకలతో తయారు చేసిన భోగి దండలను భోగిమంటలో వేశారు. వృద్ధులు భోగిమంట వద్ద కూర్చుని చలి కాచుకున్నారు. గ్రామాల్లోని తోటల్లో, మెరక ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన కోడిపందేలను తిలకించి యువకులు, పెద్దలు ఉత్సాహంగా గడిపారు. గృహాల్లో బంధువులు, కొత్త అల్లుళ్లతో కలిసి ఇంటిల్లపాదీ ఒకరిపై ఒకరు హాస్యోక్తులు విసురుకుంటూ, పిండివంటలు ఆరగిస్తూ సరదాగా గడిపారు.

కిటకిటలాడిన మద్యం దుకాణాలు, దేవాలయాలు

భోగిపండగ సందర్భంగా మద్యం దుకాణాలు కిటకిటలాడాయి. మందుబాబుల మద్యం కిక్కుతో చేసిన నృత్యాలతో గ్రామాల్లో పలు చోట్ల సందడి కనిపించింది. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు తమ ఇంటిముంగిట ఆకర్షణీయంగా రంగవల్లులు వేశారు.

జోరుగా కోడిపందేలు..

సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందేలు, గుండాట జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు విస్తృతంగా ప్రచారం చేసి, హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టర్ కృత్తికాశుక్లా, ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు ఆదేశాలతో పోలీసు, రెవెన్యూ, పంచాయతీసిబ్బంది సంప్రదాయ ఆటలే ముద్దు, జూద క్రీడలు వద్దు అంటూ కరప ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ సిబ్బందితో కలిసి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడమే కాకుండా రంగవల్లుల, వాలీబాల్, కబడ్డీ వంటి ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మరోపక్క సంప్రదాయబద్ధంగా పలు గ్రామాల్లో కోడి పందేలు, గుండాటలు జోరుగా సాగాయి. ఆయా గ్రామాల్లోని కోడిపందేల బరుల వద్దకు పోలీసులు వెళ్లి కోడి పందేలు మాత్రమే ఆడించాలని గుండాటలను నిలిపివేశారు. యువకులు, పెద్దలు, పిల్లలు కోడి పందేల్లో పాల్గొని భోగి పండగను ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకొన్నారు.

ఘనంగా భోగి పండగ

కాకినాడ రూరల్: సంక్రాంతి సంబరాల్లో తొలి పండగ భోగి సందడి చేసింది. శనివారం తెల్లవారు జామునే నిద్ర లేచి తలారా స్నానాలు ఆచరించిన నూతన వస్త్రాలు ధరించి చిన్నారులు, పెద్దలు భోగి మంటలు వద్ద చలి నుంచి ఉపశమనం పొందారు. ఆవు పేడతో తయారు చేసి భోగి దండలను మంటలో వేసి చిన్నారులు సందడి చేశారు. కాకినాడ రూరల్‌లో వీధి వీధిన తెల్లవారు జామున నాలుగు గంట నుంచే భోగి మంటలు మొదలయ్యాయి. తమ వీధి కూడళ్లలో వేసిన భోగి మంటల వద్దకు వెళ్లి తొలి పండగను సరదాగా జరుపుకొన్నారు. చాలా ఇళ్లల్లో చిన్నారులకు రేగు పండ్లను వేసి దిష్టి తీశారు. సంక్రాంతి సంబరాల్లో ఎప్పటిలాగే కోడి పందేలు సందడి చేశాయి. గుండాట జరగకుండా పోలీసులు అడ్డుకట్ట వేశారు.

శిల్పారామంలో..

కాకినాడ రూరల్: కాకినాడ శిల్పారామంలో భోగి పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్టు శిల్పారామం ఇన్‌చార్జి పరిపాలన అధికారి సి.మోహన్ తేజ తెలిపారు. అనంతరం సాంస్కృతిక కళావేదికపై శృతిలయ సంగీత నాట్యాలయం వారి కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

సంక్రాంతికి స్వాగతం

బాలాజీచెరువు: నగరంలో సంక్రాంతి శోభ సంతరించుకుంది.మహిళలు తెల్లవారు జామునే సంప్రదాయ వస్త్రధారణలో అలకరించుకుని ఇంటి ముందు సంక్రాంతికి స్వాగతం ,చెబుతూ రంగుల ముగ్గులతో మధ్యలో గొబ్బెమను అలకరించారు. అపార్టుమెంటు, చిన్న చిన్న వీధుల్లో మహిళలు సందడి చేసారు. ముగ్గుల అనంతరం శాస్త్రయుక్తంగా భోగి మంటలు వేశారు.

వాకలపూడిలో ఘనంగా సంబరాలు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి జీఎఫ్‌సీఎల్ కాలనీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు, వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులను నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ కరీం బాషా అందజేశారు.



వాకలపూడి వైద్యనగర్ వద్ద భోగి మంట

సంక్రాంతి సంబరాలు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో చింతపల్లి అప్పారావు అభ్యుదయ వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో శనివారం మైండ్ గేమ్స్, పరుగు పందెం, ముగ్గుల, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేదిక నాయకురాలు చింతపల్లి విజయ మాట్లాడుతూ విజేతలకు మకర సంక్రాంతి ఆదివారం బహుమతులు అందజేస్తామన్నారు.

సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల సందడి

కాకినాడ క్రైం: ఆర్‌ఎంసీ, గ్రీన్ అండ్ క్లీన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి వేడుకల మహోత్సవాన్ని కాకినాడ నగర ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. శనివారం కాకినాడలోని ఆర్ ఎంసీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబసమేతంగా హాజరయ్యారు. భోగి మంటలను వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలుగింటి వెలుగుల పండుగ సంక్రాంతి అని అన్నారు. ప్రజలందరూ సంక్రాంతి వేడుకలను సురక్షితంగా జరుపుకోవాలని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రంగరాయ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్ వీఎల్ నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంసీ వైద్య బృందాలు, గ్రీన్ అండ్ క్లీన్ సొసైటీ బృందం హాజరయ్యారు.



సంక్రాంతి వేడుకలకు కుటుంబ సమేతంగా హాజరైన ఎమ్మెల్యే ద్వారంపూడి

కొవ్వూరులో సంక్రాంతి సంబరాలు

కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు తారకరామా నగర్‌లో జరిగిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో రూరల్, మాజీ మంత్రి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు. కొవ్వూరు పంచాయతీ ఉపసర్పంచ్ పబ్బినీడి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్స్‌తో పాటు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని గెలుపొందిన మహిళలకు, యువతీయువకులకు ఎమ్మెల్యే కన్నబాబు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబును ఉపసర్పంచ్ పబ్బినీడి రమేష్‌బాబు, వార్డు సభ్యులు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

బొమ్మ్మాండమైన కొలువు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): పూరి గుడిసెలు, హరిదాసు, ఎద్దులు, పందెం కోళ్లు, రైతులు, ధాన్యం ఇలా పల్లె వాతావరణ ఉట్టిపడేలా స్థానిక పైడావారివీధి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడా కృష్ణమోహన్ ఇంటిలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, పల్లెటూరి సెట్టింగ్‌లు అందరినీ అలరించాయి. అష్టలక్ష్మి విగ్రహాలతో పాటు, వరుడు, వధువు, వివిధ రకాలు దేవతామూర్తులు బొమ్మలు కొలువు అందరినీ ఆకట్టుకుంది. ఏటా సంక్రాంతికి సంప్రదాయంగా వీటిని నేటి తరానికి తెలియజేయాలని ఏర్పాటు చేసినట్టు పైడా కృష్ణ మోహన్‌రెడ్డి తెలిపారు. బొమ్మల కొలువును తిలకించేందుకు పలువురు తరలివచ్చారు.



ఆకట్టుకొంటున్న బొమ్మల కొలువు



కరపలో ఓ వీధిలో వేసిన భోగి మంట



నడకుదురు సమీపంలోని మామడితోటలో నిర్వహిస్తున్న కోడిపందేలు



వేములవాడ సమీపంలో కోడిపందేల శిబిరం వద్ద మోటార్‌సైకిళ్లు

ఘనంగా గోదాదేవి కల్యాణం



రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో గోదా కల్యాణం

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో శనివారం గోదా కల్యాణం ఘనంగా జరిగింది. దేవదాయ ధర్మదాయ అధికారుల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి, సిబ్బంది, గ్రామస్తులు నారాయణరావు, తదితరులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో.. :

రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు పవన్, బృందం గోదా కల్యాణాన్ని నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆకుల రాజబాబు, నందిబాబు పాల్గొన్నారు.

కనుల వైకుంఠంగా గోదాదేవి కల్యాణం

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు భాగంగా శనివారం స్థానిక దేవాలయంవీధిలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గోదా రంగనాథుడి కల్యాణం రంగరంగ వైభవంగా జరిగింది. పుణ్యాహవచనం, జీలకర్రబెల్లం, శుభముహూర్తం, తలంబ్రాలు ఘట్టాలు కనుల వైకుంఠంగా సాగాయి. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కొడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, 30 డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్, భీమేశ్వరస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో గోదారంగనాధుల కల్యాణం కనుల వైకుంఠంగా జరిగింది. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి ఏర్పాట్లు చేశారు. స్థానిక జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలోగోదాకల్యాణం ఘనంగా నిర్వహించారు.



సర్పవరం భావనారాయణ స్వామి ఆలయంలో గోదా దేవి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



యండమూరులో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి, గోదాదేవి

కరప మండలంలో..

కరప: యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు గోదాదేవి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్వామివారిని పెండ్లికుమారుడిగా, గోదాదేవిని పెండ్లికుమార్తెగా అలంకరించి, మేళతాళాలతో వేదమంత్రోచ్చారణల మధ్య ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు వేదపండితులతో కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. యండమూరు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, కల్యాణాన్ని తిలకించారు. కరపలోని రుక్మిణి,సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం రాత్రి గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. ఉదయాన్నే వేణుగోపాలస్వామికి అభిషేకాలు, తులసీ దళాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, లక్ష్మీదేవి ప్రతిరూప మైన గోదాదేవి అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ప్రధాన అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు పి.గోపాలకృష్ణ, పి.సూర్యనారాయణ, వాడపల్లి దీక్షితులు కల్యాణాన్ని వేడుకగా జరిపారు. దేవదాయశాఖ ఈఓ వద్దాది సత్తిబాబు కల్యాణం ఏర్పాట్లను పర్యవేక్షించారు. జెడ్.భావారం విష్ణాలయంలో వంశపారంపర్య ధర్మకర్త కోటగిరి మహేంద్ర పర్యవేక్షణలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. చినమామిడాడ, కూరాడ, పెనుగుదురు గ్రామాల్లోని విష్ణాలయాల్లో కూడా గోదాదేవి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు.



కరప విష్ణాలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సినీ ప్రముఖుల రక్తదానం

కాకినాడ క్రైం: కాకినాడ శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలపై ఆకర్షితులైన సినీ ప్రముఖులు యువసేన బ్లడ్‌బ్యాంక్‌కు వచ్చి శనివారం రక్తదానం చేశారు. అశోకవనంలో అర్జున కళ్యాణం, రాజావారు రాణి గారు చిత్రాల దర్శకుడు రవికిరణ్ కోలా, పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మెప్పించిన ప్రముఖ నటుడు కసిరెడ్డి రాజ్‌కుమార్ రక్తదానం చేసి యువతలో స్ఫూర్తినింపారు. ఈ సందర్భంగా సేవా మార్గంలో పయనిస్తున్న శ్రీయువసేన వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డైరెక్టర్ రవికిరణ్, యాక్టర్ రాజ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పేద నిరుపేద వర్గాలకు శ్రీ యువసేన స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సహకారం గురించి తెలుసుకుని రక్తదానం చేసినట్టు తెలిపారు. ఆపదలో ప్రాణం నిలిపే రక్తదానానికి యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంలో త్వరలో ఓ పొలిటికల్ డ్రామాను గత సినిమాల కంటే ఎక్కువ బడ్జెట్, భారీ తారాగణంతో తెరకెక్కిస్తున్నట్టు డైరెక్టర్ రవికిరణ్ తెలిపారు. త్వరలో తాను నటించిన బెదుర్లంక, రావణ కళ్యాణం, పరువు చిత్రాలు విడుదల కాబోతున్నట్టు యాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి రక్తదానం చేసిన రవికిరణ్, రాజ్‌కుమార్‌లు ఇద్దరినీ సతీష్ సత్కరించారు.



శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న డైరెక్టర్ రవికిరణ్, నటుడు రాజ్‌కుమార్

బెంగళూరులో సీఐటీయూ అఖిల భారత మహాసభలు

కాకినాడ సిటీ: సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభలు బెంగళూరు నగరంలో ఐదు రోజుల పాటు జరగనున్నాయని సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి వెల్లడించారు. కచేరిపేటలోని జిల్లా సీఐటీయూ కార్యాలయం వద్ద అఖిల భారత మహాసభల పోస్టర్లను సీఐటీయూ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 18–22 తేదీల్లో జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 22న జరిగే బహిరంగ సభలో సీఐటీయూ చేపట్టబోయే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని బేబీరాణి వివరించారు. రానున్న కాలంలో దేశంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు ఏర్పడతాయని, ఆకలి సూచి గరిష్టానికి చేరిందని బేబీరాణి అన్నారు. సీఐటీయూ కార్మిక వర్గపు గొంతుకగా పోరాడే శక్తులకు అండగా నిలబడి దేశంలో త్యాగాల వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, కేపీనాయుడు, డీపీ రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కాకినాడ సిటీ: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఒకే కేడర్‌లో పని చేస్తున్న సిబ్బందికి రకరకాల జీతాలు ఉండడం, అందరికీ ఒకే రకమైన వేతనం ఉండాలని 104 ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశం డిమాండ్ చేసింది. శనివారం కాకినాడ కచేరిపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో పలువురు యూనియన్ నాయకులు మాట్లాడారు. 15 ఏళ్ల నుంచి ఈ వ్యవస్థ కొనసాగుతుందని, ఆ నాటి నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగానే కొనసాగుతున్నామన్నారు. కేడర్ ఒకటే అయిన వేర్వేరు వేతనాలు ఉండడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 62 వాహనాలు ఉన్నాయని, ఒక్కో వాహనంపై డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అశుతోష్ మిశ్రా కమిటీ నివేదికను అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. ఆ నివేదిక ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అంత వరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ విషయమై రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో 104 ఉద్యోగుల సంఘం నాయకులు మేడిశెట్టి త్రిమూర్తులు, కేపీ కేశవరావు, పేర్రాజునాయుడు, కె నరసింహ, గుబ్బల రమణ, రత్నంరాజు, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా మేడిశెట్టి త్రిమూర్తులు, ఉపాధ్యక్షులుగా ఇందుమతి, బత్తిన అనిల్‌కుమార్, తదితరులు ఎన్నుకున్నారు.

జీవో నంబర్ 1 రద్దు కోరుతూ నిరసన

కాకినాడ సిటీ: రోడ్లపై ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్–1ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాకినాడలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద భోగిమంటలో జీవో నంబర్–1 ప్రతులను వేసి ఏపీసీఎల్ఏ (ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటాన్ని అణచివేయడానికి ఆనాడు బ్రిటిష్ వారు తీసుకొచ్చిన జీవోను నేడు ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం కోసమే ఈ జీవోను తీసుకొచ్చారని ఆందోళనకారులు వివరించారు. జీవో నంబర్ 1 రాజ్యాంగం ఇచ్చిన పౌర హక్కులను కాలరాయడమేనన్నారు. విపక్షాలు, ప్రజా సంఘాలు గొంతునొక్కే ప్రయత్నమే ఈ జీవో అన్నారు. జీవో తక్షణం రద్దు చేయాలని లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎల్ఏ జిల్లా నాయకులు సీహెచ్ అజయ్‌కుమార్, కె.నాగజ్యోతి, సీపీఎం నాయకులు ఎం రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ, సత్తిరాజు, వీరబాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.